మహాత్మా

# జ్యోతిరావు ఫూలే

(నాటకం)



డా॥ డి. విజయభాస్కర్

# మహాత్మా జోతిరావు పూలే

## (నాటకం)

(ఇంకా తెర లేవలేదు)

**వ్యాఖ్యానం :** అది అంధయుగం. అణగారిన కులాల్లో చీకటి యుగం. ఆనాడు అంటరాని కులాల పరిస్థితి మూతికి ముంత నడ్డికి చీపురు. ఎందుకంటే వాళ్ల నోటి నుండి వచ్చిన ఉమ్మి నేల మీద పడకూడదు. వాళ్లు నడిచిన అడుగులు నేలమీద కనపడకూడదు.

ఈ అంధయుగ నేపథ్యంలో మహారాష్ట్ర పీష్వాల ఏలుబడిలో ఉంది. అధికారమంతా వీళ్లదే. వీరి భావజాలమే రాజ్యాంగం. బ్రిటిష్ వాళ్ల పాలన సాగుతున్నా అణగారిన కులాలపై వీరిదే ఆధిపత్యం. అప్పటి భారతదేశంలో అణగారిన వారి జీవితం ఎలా ఉందో కోండిబా–దగడాబాయి అనే చర్మకారుల ఇంటికెళ్లి చూద్దాం.

-LIGHTS ON -

## సన్నివేశం-1

(అది కోండిబా ఇల్లు – అతని భార్య దగడాబాయి.
ఆమె ప్రవేశించింది.)

**దగడ** : ఇవి కొత్త చెప్పులు – ఈ రోజు తీసుకెళ్ళాల్సినవి – ఇదొక మూట – ఇవ్వింకా కుట్టాల్సినవి – రేపటికి సిద్ధం చెయ్యాలి – ఇదొక మూట. ఇవేమో శుభ్రం చేసేసిన తోళ్లు – వీటన్నటిని ఒక మూట గట్టాలి. (మూట గట్టబోయింది – వాటిలో తాళపత్రాల కట్టను చూసి పామును చూసినట్టు భయపడింది) – అమ్మో – ఇది వీటిలో కెట్టా వచ్చింది. బాపనయ్యోళ్లు చదువుకునే పుస్తకం – కొంపదీసి... బాబ్యాగాడు ఎక్కడనుండో తెచ్చి ఇక్కడ దాచాడా? ఏమో అనుకున్నా! వాడూ! అమ్మా నేను చదువుకుంటానని రోజూ సతాయిస్తుంటే ఏదోలే అనుకున్నా! ఆడంతదాకా వచ్చినాడన్నమాట. కొడుకా! మనం చదువుకో కూడదు. మూతికి ముంతా! మెడలో గంటా నడ్డికి చీపురు కట్టుకొని ఊరికి దూరంగా ఉండాలిగానీ, ఊర్లోని పెద్ద మనుషుల దగ్గరకు పోకూడదురా

అని ఎంత జెప్పినా అర్థంకాదు. ఇప్పుడెంత పన్జేసాడు సరస్వతీదేవిని, చెప్పుల కుట్టే తోళ్ల మధ్య, పెట్టేడు. ఎంత పాపం! ఔన్లే ఇంకెక్కడ దాస్తాడు చెప్పులుకుట్టే చర్మకార్ల ఇంట్లో తోల్లు గాకుండా వ్యాస పీఠాలుంటాయా! ఊర్లో అన్ని ఇళ్ళల్లో తిరుగుతున్నాయి పక్షులు. అన్ని ఇళ్ళల్లో తిరుగుతున్నాయి కుక్కలు, పిల్లులు. మనం మాత్రం ఎందుకు తిరగ్గూడదు అని నన్ను రోజూ అడుగుతాడు బాబ్యా! నేనేమని జెప్పేదివాడికి. అయ్యా! ఇది వామనుడేలుతున్న రాజ్యం! ఇంకా మన బలి చక్రవర్తి రాజ్యం రాలేదు. మన బతుకులు పిల్లులు, కుక్కల కన్నా హీనమయ్యా!

అందుకని వామనుడి వారసులతో మన బలిజనం కలిసి తిరగ్గూడదని చెబితే వాడికర్థం కావడం లేదే! బాబ్యా నా ఒక్కగానొక్క కొడుకు. ఎర్రిబాగుల కొడుకు. అమ్మా! మనం బలి చక్రవర్తి వారసులం కదా! నేను బలి చక్రవర్తినవుతానమ్మా! వామనుల వారసుల్ని జయిస్తానమ్మా అని పెద్ద పెద్ద మాటలు శెబుతాడు నా చిన్నారి బాబ్యా!

చిన్న కత్తికి పెద్ద కత్తికి తేడా తెలీదు వాడికి. పనికత్తి చేతబట్టి చర్మాన్ని అచ్చులుగా కొయ్యలేడు. గుర్తుగా గూడకట్టలేడు. ముంగూటం తిప్పలేడు. ఆరెతో దారం లాగి గూటంతో దెబ్బ వెయ్యలేడు. చిన్న వయసు. పెద్దయ్యాక బలిచక్రవర్తి నవుతానంటాడు నా బాబ్యా! బలి చక్రవర్తి కాకపోతే పోనీ ఆ బ్రాహ్మణ భట్టుల చేతిలో బలి కాకుండా ఉంటే అంతే చాలు.

ఇప్పుడీ తాటాకుల కట్ట ఎక్కడ నుండి దొంగిలించాడు. దీని గురించి ఆ బాపనయ్యోల్లకి తెలీకముందే దీన్ని ఏదో ఒక విధంగా వాళ్లకి అప్పగించెయ్యాల. అప్పుడు గానీ నా ప్రాణాలు కుదుటపడవు. (అని తాళ పత్రాలను బయటకు తీసింది. ఆ తాటాకుల మీద కుంకుమ కనిపించింది) ఆహా! కుంకుమ! ముత్తయిదువులు పెట్టుకునే కుంకుమ. పెద్ద కులపు ఆడోళ్లంతా పెట్టుకునే ఎర్రటి కుంకుమ. కానీ ఈ కుంకాన్ని మేము మాత్రం పెట్టుకోకూడదు. కనీసం ముట్టుకోకూడదు. ఈ కుంకుమ బొట్టు పెట్టుకుందని గంగాబాయి చూపుడువేలు తీసేసారు కదా పంచాయితీ పెద్దలు – మేము పసుపుబొట్టు మాత్రమే పెట్టుకోవాలి. మాకెవ్వరూ కుంకుమ అమ్మకూడదు. అమ్మిన వారిని వెలివేస్తారు. కుంకుమ పెట్టుకుంటే చూపుడు వేలు తీసేస్తారు. కానీ ఎర్రటి కుంకుమ

బొట్టు నొసటిమీద ఉంటే ఎంత దర్జా. ఒక్కతూరి... ఒక్కతూరి అంటే ఒక్కతూరి ఈ కుంకుమ నా నొసటిన దిద్దుకుంటాను. (అని ముంతలో నున్న నీటిలో ముఖాన్ని చూసుకుంటూ కుంకుమబొట్టు దిద్దుకుంటుంది) అబ్బా! కుంకుమబొట్టు పెట్టుకుంటే ఇంత అందం వస్తుందా! ఎంత అందంగా ఉన్నావే దగడాబాయి! (అని మురిసిపోతుండగా కోండిబా అరుచుకుంటూ ప్రవేశిస్తాడు)

**కోండిబా** : యేయ్ దగడా!

**దగడాబాయి** : (మూడు మూటలూ కంగారుగా కలిపేసి మూటకడుతుంది. పరిగెత్తుకుంటు వచ్చి కోండిబా ముంతా, తాటాకూ విప్పుతుంది)

**కోండిబా** : యేంటే దగడా కొత్త చెప్పులూ, కుట్టాల్సిన చెప్పులూ, తోళ్లూ అన్నీ కలిపి మూట కట్టేస్తున్నావ్? కొత్త చెప్పులు తీసి ఇక్కడబెట్టు.... తీసుకెళ్లాల.

**దగడ** : తీసుకెల్దువులే ముందు కొంచెం అంబలి తాగు.

**కోండిబా** : తాగుతాలేగానీ ముందు నీళ్లియ్యవే... నోరు ఎండిపోయింది.

**దగడ** : (ముంతతో నీళ్లు ఇచ్చింది)

**కోండిబా** : (ముంతనీళ్లలో దగడాబాయి నీడచూసి) ఏదీ ఇటురా!

**దగడ** : (దగ్గరగా వచ్చింది)

**కోండిబా** : కొంచెం వంగు

**దగడ** : (ముంతమీదికి వంగింది)

**కోండిబా** : యెంత బాగున్నావే దగడా, ఈ ముంతలో యేం మహత్యం వుందోగానీ నువ్వు పెట్టుకున్న పసుపుబొట్టు యెర్రగా కుంకంలా మెరిసిపోతుందే చూడు... చూడు... యెంత బాగున్నావో... గ్రామ దేవతలాగా.

**దగడ** : నేను ఎర్రటి కుంకుం బొట్టు పెట్టుకుంటే నీకు యింత యిష్టమా? అయితే రోజూ పెట్టుకుంటాలే.

**కోండిబా** : ఆ! నిజంగానే కుంకం పెట్టుకున్నావా? యెంతకి తెగించావే? నేను ముంతలో మహత్యం అనుకున్నా. వోసినీ... యెంత పని చేశావు? కుంకం యెక్కడిదే నీకు? యెవరికైనా తెలిసిందంటే మన కొంపకు అగ్గెట్టేస్తారే దగడమ్మా. నిప్పులాంటి మనిషిని నేను. నిప్పుల్లో తొయ్యద్దే.

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Mahatma+Jyotirao+Phule

* * *